క్లుప్తంగా

పాఠశాలకు రూ.1.75 లక్షల సామగ్రి విరాళం



సామగ్రి అందిస్తున్న సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు యూత్ ఫర్ మీసేవా ఆధ్వర్యంలో రూ.1.75లక్షల విలువైన సామగ్రిని గురువారం ఉపాధ్యాయులకు అందజేశారు. విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించాలనే ఉద్దేశంతో ఎల్‌ఈడీ టీవీ, సోలార్ ఇన్వర్టర్‌ను అందజేశారు. పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ఉపాధ్యాయులు యూత్ ఫర్ మీసేవ సభ్యులను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు భోజన్న, పాఠశాల కమిటీ సభ్యులు నాగేశ్ ఉన్నారు.

ముగిసిన అఖండ సప్తాహం

ముధోల్: మండలంలోని చించాలలో ఏడు రోజులుగా కొనసాగుతున్న అఖండ హనుమాన్ సప్తాహం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. వారం రోజులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నిర్మాణ పనులు నిలిపివేత

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో కోర్టు పరిధిలో ఉన్న భూమిని గ్రామంతో సంబంధం లేని వ్యక్తి చదును చేస్తూ అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నారని నర్సాపూర్ (జి) గ్రామస్తుడు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి గురువారం అనుమతుల్లేకుండా చేపట్టిన పనులను నిలిపివేశారు.

'వేతన వర్గాలకు నిరాశ'



నిర్మల్: కేంద్ర బడ్జెట్ వేతన వర్గాలను తీవ్ర నిరాశ పర్చిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్లుగా స్లాబ్ రేట్లు మార్చకుండా కొనసాగిస్తూ వస్తోందన్నారు. సేవింగ్ పరిధి కూడా లక్షా 50 వేలను కొనసాగించిందని, స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేలు ఉన్నదాన్ని రూ.75వేలు చేయడమొక్కటే ఈ బడ్జెట్లో ఊరట కలిగించిందని పేర్కొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందిస్తున్న ఆశావర్కర్లు

కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశావర్కర్లు ఈనెల 18 నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టనున్నారు. గురువారం కుంటాలలో పీహెచ్‌సీ వైద్యురాలు అమృత యానికి సమ్మె నోటీసు అందజేశారు. ఇంద్రమాల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్)లో గురువారం డ్రీమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నానో డీఏపీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ పంటల్లో నత్రజని, భాస్వరం లోపాలను సరి చేయడంలో నానో డీఏపీ ఉపయోగపడుతుందన్నారు. ఈ విధానంతో పర్యావరణానికి హాని కలగకుండా పంటలకు పోషకాలను అందించవచ్చని పేర్కొన్నారు. సభ్యులు చిన్నయ్య, రైతులు ఉన్నారు.

అమ్మవారి ఆలయం నిర్మించాలని పూనకాలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఇందిరమ్మ కాలనీలో పోచమ్మ ఆలయం నిర్మించాలని ఇద్దరు మహిళలు, మరో వ్యక్తి (శివసత్తులు) పూనకాలతో డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన పలువురు వచ్చి ఆ స్థలం తమదని వాగ్వాదానికి దిగారు. కాసేపు ఉద్రిక్తత నెలకొనగా కాలనీవాసులు పోలీసులకు సమాచారమిచ్చారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సిబ్బంది వచ్చి ఇరు వర్గాలతో మాట్లాడారు. సమస్య ఉంటే అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆధునిక సాగుకు ప్రోత్సాహం

కుంటాల: ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసే రైతులను ప్రోత్సహిస్తామని డ్రీమ్ సొసైటీ డైరెక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్, అందాకూర్, దౌనెల్లి గ్రామాల రైతులకు అందాకూర్‌లో రెయిన్ పైపులు, గొర్రెలు, మేకల కాపరులకు గ్రీన్‌మ్యాట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ నీటి వినియోగంతో పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి కిషన్, ఏఈవో గణేశ్, కార్యదర్శి రమ్య, సొసైటీ సభ్యులు రాజేందర్‌రెడ్డి, ప్రణీత, సుధాకర్ పాల్గొన్నారు.

అడవిపందులతో అగచాట్లు

- గుంపులుగా వచ్చి మొక్కజొన్న చేలను ధ్వంసం చేస్తున్న వైనం
- గోస పడుతున్న అన్నదాతలు
- పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు వేడుకోలు



పెంచికల్‌పాడ్‌లో రక్షణగా చీరలు చుట్టిన రైతు



పై చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు పడకంటి సాయి. కుంటాల మండలం అందాకూర్‌లో ఆరు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. ఇటీవల ఎకరం చేనును అడవి పందులు ధ్వంసం చేశాయని బాధితుడు వాపోయాడు. కంకులుగా మారుతున్న వేళ పందుల గుంపు వచ్చి నష్టపరచడంతో కష్టమంతా వృథాగా పోయిందని దిగులు చెందుతున్నాడు. అధికారులు పరిశీలించి పరిహారం అందించాలని వేడుకుంటున్నాడు.

కుంటాల: ఆరుగాలం శ్రమించే రైతులకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. యాసంగిలో సాగు చేసిన పంటలను ఓ వైపు చీడపీడలు ఆశిస్తే.. మరోవైపు అడవి జంతువులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రి వేళ కాపలా ఉంటున్నా..పంటలను ధ్వంసం చేస్తూ రైతులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయి. గుంపులుగుంపులుగా వచ్చి కంకులను తినడం కంటే మొక్కజొన్న చేన్లలో తిరుగుతూ పంటలను ఎక్కువ విస్తీర్ణంలో ధ్వంసం చేస్తున్నాయి. వ్యవసాయాధికారులు, అటవీశాఖ అధికారులు అడవిజంతువుల నుంచి పంటల రక్షణకు చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా యాసంగిలో 90 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కుంటాల మండలంలో10,250 ఎకరాల్లో పంట సాగు చేశారు. ఓలా, అంబకంటి, కుంటాల, దౌనెల్లి, అందాకూర్, లింబా(కే), సూర్యాపూర్ గ్రామాల్లో పంటలను ధ్వంసం చేశాయి.

జాగరణ చేస్తున్నా..

రూ.వేలు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులను అడవిపందులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాటి నుంచి పంటలను కాపాడుకునేందుకు చేన్ల వద్ద చలిమంటలు వేసుకొని జాగరణ చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి సోలార్ కంచెను ఏర్పాటు చేసుకున్న ఫలితం ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



అడవి పందులు మొక్కజొన్న పంటలను తీవ్రంగా ధ్వంసం చేస్తున్నాయి. సోలార్ కంచె ఉన్నా ఫలితం ఉండటం లేదు. ఏడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ఇప్పటికే ఎకరంలో పందుల గుంపు తిరగడంతో మొక్కలు చనిపోయాయి. అధికారులు తమను ఆదుకోవాలి.

– చాకలి రాజన్న, కుంటాల

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఇటీవల గ్రామాల్లో అడవి జంతువులు పంటలపై దాడి చేస్తున్న మాట వాస్తవమే. వ్యవసాయ, అటవీ, వ్యవసాయాధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తారు. రైతులు కంచెలు ఏర్పాటు చేసుకోవాలి. రైతులకు ప్రమాదం జరిగితే అటవీశాఖ ఆధ్వర్యంలో పరిహారం అందుతుంది. పరి హారం విషయమై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

కుభీర్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహాదేవ్ మందిరంలో గురువారం బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మొత్తం ఓట్లలో 75 శాతం సాధించాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 49 శాతం ఓట్లు వచ్చాయని వివరించారు. గావ్ చలో అభియాన్‌లో భాగంగా కార్యకర్తలు ఈనెల 5, 6, 7, 8 తేదీల్లో పల్లెలకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం, 370 అధికరణ తొలగింపు గురించి ప్రజలకు చెప్పాలని సూచించారు. తనకు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా శక్తికి ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బి.విఠల్, వి.నాగేశ్, కమ్లేశ్, డాక్టర్ గణపతి, లింబాద్రి, గంగాశేఖర్, పి.గంగాధర్, వెంకట్రావ్ పటేల్, ఉప్పు దత్తు, గులాబ్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వారసంతకు షెడ్డు మంజూరు

ముధోల్: ముధోల్ రైతుబజార్ ఏర్పాటుకు షెడ్ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రామారావుపాటిల్ తెలిపారు. గురువారం షెడ్డుకు సంబంధించిన మంజూరు పత్రాలను ముధోల్ సర్పంచ్ రాజేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు. త్వరలో నిర్మాణ పనులు మొదలుపెట్టి మార్కెట్‌షెడ్డుతోపాటు మరుగుదొడ్లు, పార్కింగ్, వసతులు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. సీఆర్డీ జిల్లా బాధ్యులు కిరణ్‌కుమార్, పీవో రాజు, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, మండల ఇన్‌చార్జి తాటివార్ రమేశ్, నాయకులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నిర్మల్‌లో సన్మానిస్తున్న అధికారులు



కుంటాల: వాహనదారుడిని సన్మానిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి అజయ్ కుమార్‌రెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం అన్నారు. 37వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద గురువారం హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు గులాబీ పువ్వు అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రజనీ బాయి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శం..సాయికుమార్..!

కుంటాల: హెల్మెట్ ధరించి అన్ని పత్రాలు వెంట ఉంచుకొని నిబంధనలు పాటిస్తున్న పెంచికల్‌పాడ్‌కు చెందిన గారె సాయికుమార్ అనే ద్విచక్రవాహనదారుడిని పోలీసులు సన్మానించారు. గురువారం మండలంలోని ఆర్టీ(కె) 61 జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఎస్సై హన్మాండ్లు, ఏఎస్సై దేవ్‌రావు సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో శుభ్రతపై దృష్టి సారించండి

తానూరు: మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి గ్రామాల్లో శుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. క్లోరినేషన్ నీటిని ప్రజలకు అందించి నర్సరీల నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సభను జయప్రదం చేయండి

ముధోల్: ఇంద్రవెల్లిలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి గంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

కుంటాల: ఇంద్రవెల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే సభను విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ పేర్కొన్నారు. గురువారం కుంటాలలో విలేకరులతో మాట్లాడారు. పోశెట్టి, యూనిస్, దయాకర్, శివ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పనులు పరిశీలన

కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనఊరు– మనబడి పనులను గురువారం ఎంపీపీ గజ్జారాం యాదవ్ పరిశీలించారు. అదనపు గదులు, డైనింగ్ హాల్ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రతన్‌కుమార్, ఉపాధ్యాయులు సగ్గం గంగాధర్, ధర్మాజీ చందనే, సల్లా శ్రీనివాస్, వెంకట్‌రావు తదితరులు ఉన్నారు.

సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నెహ్రూ యువ కేంద్రం నిర్మల్ జిల్లా కమిటీ సభ్యుడిగా నియమితులైన బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఆకుల కార్తీక్‌ను ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, యువ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్, సుంకరి సాయి, రాహుల్, శ్రీనివాస్, రమణ, మధుకర్ రాహుల్ పాల్గొన్నారు.

యాప్‌పై అవగాహన

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామ సమైక్య సంఘ భవనంలో గురువారం నర్సాపూర్(జి), కుంటాల మండలాల వీవోఏలకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాల సమాచారాన్ని ఎస్‌ఆర్‌ఎల్‌ఎంలో పొందుపరచాలని ఏపీఎంలు సూచించారు. ఏపీఎంలు అశోక్, సుదర్శన్, సులోచన, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ పంచాయతీకి ట్రాక్టర్ విరాళం



ట్రాక్టర్ అందిస్తున్న సర్పంచ్ లక్ష్మి రాజనర్సయ్య

సోన్: మండలంలోని కడ్తాల్‌లో గ్రామపంచాయతీకి సర్పంచ్ బర్మ లక్ష్మిరాజనర్సయ్య దంపతులు ట్రాక్టర్‌ను విరాళంగా అందించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో తమ తల్లిదండ్రులు లసుంబాయి రాజగంగన్న జ్ఞాపకార్థం రూ.మూడు లక్షల విలువైన ట్రాక్టర్‌ను అందించారు. అనంతరం గ్రామస్తులు.. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుసభ్యులను సన్మానించారు. కార్యదర్శి సుమయ్యద్ తస్కీన్, నితీశ్‌కుమార్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



లక్ష్మణచాందలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: కేంద్ర ప్రభుత్వం బిహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంపై మండల కేంద్రంలో గురువారం నాయీ బ్రాహ్మణ సంఘం, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు నాగుల రాజ్‌కుమార్, బీజేపి మండల ఉపాధ్యక్షుడు గుడ్ల రంజిత్, ప్రధాన కార్యదర్శి అల్లూరి రాజు, అడ్వాల రమేశ్, నాయీ బ్రాహ్మణులు, ఓబీసీ మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముధోల్: దివంగత నేత కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ముధోల్‌లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ముధోల్ ఎమ్మెల్యే రామారావుపాటిల్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం తాలూక అధ్యక్షుడు మారుతి, మండలాధ్యక్షుడు ఎం.గంగాధర్, ప్రధాన కార్యదర్శి ఎం.మారుతి, పట్టణ అధ్యక్షుడు డి.రమేశ్, డి.సురేశ్, విశ్వనాథ్, సంతోష్ తదితరులున్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యులు

సోన్: గర్భిణులు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. అనంతరం బాలింతతో మాట్లాడి సౌకర్యాలను తెలుసుకున్నారు. వైద్యుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బీరప్ప ఉత్సవాలు



ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో బీరప్పకామరాతిల కల్యాణం పురస్కరించుకుని ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం మంద పోచమ్మ, ఊరపోచమ్మలకు బోనాలు తీసుకెళ్లి పూజలు చేశారు. శుక్రవారం స్వామివారికి పాలు, నెయ్యి, అభిషేకాలతో పాటు శనివారం గంగబోనం ఉంటుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 4న బియ్యం సుంకు పట్టుట, బోనాల ఊరేగింపు, 5న బీరప్ప స్వామి కల్యాణం, 6న పట్టణంలో జోగు తిరగడం, బోనాల ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. 7న నాగవెల్లి, 8న గారడీ, ఎట్టిముల్లెలు, 9న దిష్టికుంభం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 7న కడవెండి దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరిస్తామని భక్తులు వచ్చి విజయవంతం చేయాలని కుర్మసంఘం నాయకులు కోరారు.

కొనసాగుతున్న ఆలయ ఉత్సవాలు



బోనాలతో వెళ్తున్న భక్తులు

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రాగణంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం ఒంటి గంటకు అంతరాష్ట్ర మల్లయోధులకు కుస్తీ పోటీలు తెలిపారు. విజేతలుగా నిలిచిన మల్లయోధులకు ప్రథమ బహుమతి రూ.7,777, ద్వితీయ బహుమతి రూ.5,555 నగదు అందించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు.

ఆయిల్‌పాం పరిశీలన

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో బొజ్జ ఎర్రన్న సాగు చేస్తున్న ఆయిల్‌పాం పంటను గురువారం ఎంపీడీవో శేఖర్ పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద రెండెకరాల్లో గుంతలు తవ్వి మొక్కలు నాటినట్లు రైతు పేర్కొన్నాడు. ఆయన వెంట ఎఫ్ఏ శ్రీనివాస్ ఉన్నారు.

పంచాయతీ పాలకవర్గాలకు సన్మానం



మామడ: కొరిటికల్‌లో సన్మానం పొందిన నేతలు



సారంగపూర్‌లో నివాళులర్పిస్తున్న సర్పంచులు



కడెం: నచ్చన్‌ఎల్లాపూర్‌లో గంగన్నతో టీచర్లు



ముధోల్‌లో సన్మానిస్తున్న నాయకులు

మామడ: మండలంలోని కొరిటికల్, లింగంపల్లి గ్రామాల్లో గురువారం సర్పంచ్, వార్డుసభ్యులను గ్రామస్తులు సన్మానించారు. కొరిటికల్ సర్పంచ్ భోజవ్వ, లింగంపల్లి సర్పంచ్ గంగాధర్, వార్డుసభ్యులను శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో రమేశ్, పంచాయతీ కార్యదర్శి సురేశ్ ఉన్నారు.

సోన్: మండలంలోని న్యూబొప్పారంలో సర్పంచ్ వెంకాయి హరిత శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యదర్శి లక్ష్మణ్, గౌతమ్‌రెడ్డి, రాజు, గంగారెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

సారంగపూర్: ఎంపీడీవో కార్యాలయంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ పతాని రాధ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచ్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి పి.నర్సారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించి సర్పంచ్‌లను సన్మానించారు. ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏఓ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపాడని పాఠశాలల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గురువారం నచ్చన్‌ఎల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో గంగన్నను సన్మానించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, హెచ్‌ఎంలు ప్రతాప్‌సింగ్, భీమలింగం ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో మున్నూరు కాపు సంఘం, దళిత బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్పంచ్ లక్ష్మిరమేశ్‌ను శాలువాతో సన్మానించారు. దళిత బహుజన నాయకులు చాకేటి లస్మన్న, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనంతుల సంతోశ్, మాజీ సర్పంచ్ రామేశ్వర్, రామారావు, గంగయ్య, దుబాయ్ శీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో నర్సాపూర్(జి) సర్పంచ్ అరుగుమీది రాంరెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు. రైసస జిల్లా సభ్యుడు కొండ్ర రమేశ్, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బర్కుంట గంగారాం, మండల కోఆప్షన్ సభ్యులు ఫసి, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి పాల్గొన్నారు.

ముధోల్: ఎంపీడీవో కార్యాలయంలో ముధోల్ పంచాయతీ సర్పంచ్ రాజేందర్, వార్డుసభ్యులను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, కోఆప్షన్ సభ్యుడు ఖలీద్, అనిల్, మోహన్, నాయకులు పాల్గొన్నారు.

రజకసంఘం ఆధ్వర్యంలో పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ చెరువు వద్ద మడివాళ మాచి దేవుడి జయంతి నిర్వహించారు. పూజల అనంతరం రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చందుల ఊశన్న మాట్లాడుతూ మడివాళ మాచి దేవుడు రజకుల ఆరాధ్య దైవమన్నారు. నిధులు విడుదలైనా ఆలయ పనులు పూర్తి కాలేదని.. అధికారులు పూర్తి చేయించాలని కోరారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షులు మరిపెద్ది బాలరాజు, షాపింగ్ అధ్యక్షులు సంఘం రమణ, బాగులవాడ పెద్దమనిషి దేవరాజు, బంగల్‌పేట్ పెద్దమనిషి శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

కుంటాల: తప్పుల్లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియను డీటీ నరేశ్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు.